క్లుప్తంగా

కాలిబాట వంతెన పనులు ప్రారంభం



తాతపూడి వద్ద కాలిబాట వంతెన నిర్మాణ పనులు

కపిలేశ్వరపురం: తాతపూడి గ్రామ శివారు చినతాతపూడిలో బ్యాంక్ కెనాల్‌పై కాలిబాట వంతెన నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రూ.20 లక్షల మండల పరిషత్తు నిధులతో నిర్మించ తలపెట్టిన పనులను పంచాయతీ రాజ్ డీఈ రామనారాయణ, జేఈ డీవీ రాఘవులు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, నాయకులు జుత్తుక సూరిబాబు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అధికారి ఆనంద్‌కుమార్ పర్యవేక్షించారు. వంతెన నిర్మాణానికి మార్కింగ్ వేశారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్ కంటి వెలుగుతో అంధత్వానికి చెక్



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత రాంబాబు

మండపేట: కంటి సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం దోహదపడుతుందని వైఎస్సార్ సీపీ నేత కొమ్ము రాంబాబు అన్నారు. స్థానిక 20వ వార్డులో గురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వృద్ధుల్లో అంధత్వ నివారణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. కంటి వెలుగు వైద్య శిబిరాల ద్వారా ముందుగానే కంటి సమస్యలు గుర్తించి వైద్య సాయం అందిస్తున్నారన్నారు. ఈ పథకం కింద కంటిచూపు మెరుగుపర్చేందుకు ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందించడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఆయన కళ్లజోళ్లు అందజేశారు. కంటి వైద్య నిపుణుడు ఎస్.సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, పార్టీ నాయకులు పేరూరి మాధవి, కొమ్మోజు నాగేశ్వరరావు, అడపా సాయి, మోర్తా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ఏకాహం

కపిలేశ్వరపురం: అంగర గ్రంథాలయం సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఏకాహం ప్రారంభమైంది. ఉదయం స్వామికి పూజలు చేసి గ్రామానికి చెందిన భజన భక్త బృందం సభ్యులు ఏకాహ భజన చేశారు. లోక కల్యాణార్థం స్వామిని కీర్తిస్తూ కీర్తనలు ఆలపించారు. ఆలయంలో గురువారం నిర్వహించే పూజా కార్యక్రమంతో ఏకాహం ముగియనుందని ఆలయ అర్చకుడు ఎస్ఎల్ఎస్‌టీ శ్రీనివాస్, నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్న పాలన ఓ సువర్ణ అధ్యాయం

కాజులూరు: రాష్ట్ర చరిత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఓ సువర్ణ అధ్యాయంలా నిలిచిపోతుందని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. గురువారం కాజులూరు శివారు చాకిరేవుమెరకలో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మత్స్యకార భరోసా పథకం ద్వారా వరుసగా నాలుగో ఏడాది కూడా చేపట వేట నిషేధ సమయంలో జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున సహకారాలు అందించటం జగనన్న ఔన్నత్యానికి నిదర్శనమన్నారు. కుల వృత్తులు చేసుకునే వారికి ఏటా జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో దుగ్గుదుర్రు గ్రామ మాజీ ఎంపీటీసీ మాత నూకరావు, స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పెదిరెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గాయపర్చిన భార్య, అత్త, బావమరిదిలపై కేసు

అయినవిల్లి: గుర్తుతెలియని ఫోన్ నంబర్ నుంచి కాల్ రావడంపై భార్యను ప్రశ్నించిన భర్తను గాయపరిచిన ఘటనపై గురువారం స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి టీటీఆర్ నగర్‌లో కమిడి కిశోర్, సౌదామణి నివాసం ఉంటున్నారు. సౌదామణికి బుధవారం ఒక గుర్తుతెలియని ఫోన్ నెంబర్ నుంచి కాల్ రావడంతో భర్త కిషోర్ ప్రశ్నించాడు. తనను ప్రశ్నించడంతో భార్య సౌధామణి, అత్త పరమట కుమారి, బావమరిది రాజ్ కుమార్ కోపంతో కిషోర్‌పై రక్తాలు వచ్చేలా దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితుడు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యోస్మి..

- వేగవంతంగా ధాన్యం కొనుగోలు
- త్వరితగతిన సొమ్ము చెల్లింపు
- గిట్టుబాటు ధర పొందుతున్న రైతులు

సాగు బంగారమైంది.. పుడమి పుత్రులకు సిరులు కురిపిస్తోంది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది.. సాగు ఆరంభం నుంచి ధాన్యం విక్రయించే వరకూ రైతన్నలకు అండగా నిలుస్తోంది.. పండిన పంటకు గిట్టుబాటు ధర అందిస్తుండడంతో రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రస్తుతం రామచంద్రపురం నియోజకవర్గంలో ఆర్బీకేల ద్వారా ధాన్యం విక్రయాలు ఊపందుకున్నాయి.

కాజులూరు: నియోజకవర్గ గ్రామాల్లో రైతులు అధికంగా వరి సాగు చేస్తుంటారు. వరి పంట అంతా ఒకేసారి కోతకు రావటం, పంట దిగుబడి సమయంలో సరైన గిట్టుబాటు ధర లేకపోవటంతో అన్నదాతలు దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోయేవారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా రైతులు మరలా దళారులనే ఆశ్రయించాల్సి వచ్చేది. అయితే రైతుల సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లోని అన్ని ఆర్బీకేల్లోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి బాలారిష్టాలను సరిచేయడంతో రైతులు వీటిని సమృద్ధిగా సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఊపందుకున్న ధాన్యం విక్రయాలు

ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ గ్రామాల్లోని వరి మాసూళ్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు వీడిన తర్వాత రైతులంతా ఒకేసారి మాసూళ్లు నిర్వహించటంతో ధాన్యం విక్రయాలు ఊపందుకున్నాయి. దీంతో ధాన్యం కొనుగోలులో లోడింగ్, అన్‌లోడింగ్ సకాలంలో జరగక ట్రాన్స్‌పోర్ట్ సమస్యలతో పాటు, సంచుల కొరత తలెత్తింది. అయితే ప్రభుత్వం వ్యవసాయశాఖ, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులను నిరంతరం గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంచి వారి పర్యవేక్షణలో పనులను వేగవంతం చేసింది.



గొల్లపాలెంలో హమాలీలతో ధాన్యం తూకం వేయిస్తున్న రైతులు

ఆర్బీకేల్లోనే మద్దతు ధర

రైతులు ధాన్యం విక్రయించదలిచామని కొనుగోలు కేంద్రాలకు వచ్చి చెప్పిన వెంటనే ఆర్‌బీకేల్లోని టెక్నికల్ అసిస్టెంట్, వీఏఏలు సాంపిల్స్ సేకరించి ఒకట్రెండు రోజుల వ్యవధిలోనే ఆన్‌లైన్ ప్రాసెస్ పూర్తిచేసి ధాన్యం రైసుమిల్లులకు చేరవేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 75 కేజీల బస్తాకు మద్దతు ధర రూ.1530 ప్రకటించింది. హమాలీ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు చార్జీల కింద మరో రూ.39 చొప్పున ప్రభుత్వమే భరిస్తూ రైతుకు మొత్తం రూ.1569 చెల్లిస్తుంది. అయితే నేటికి కొన్ని చోట్ల దళారులు రైతులను మభ్యపెట్టి 75 కేజీల బస్తా రూ.1300కే కొనుగోలు చేస్తున్నారు. గతంలో ధాన్యం విక్రయించిన తర్వాత సొమ్ములు రైతులకు చేరేందుకు కాస్త ఆలస్యమయ్యేది. ఈ అంశాన్ని సాకుగా చూపిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే ఇప్పట్లో సొమ్ములు రావని దళారులు రైతులను నమ్మించి అయినకాడికి పట్టుకుపోతున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 21 రోజుల వ్యవధిలోపే సొమ్ములు రైతు ఖాతాలకు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దానికి తోడు మండల గ్రామాల్లో కొందరు రైతులకు ధాన్యం విక్రయించిన వారం, పది రోజుల్లోపే గడువుకు ముందే సొమ్ములు జమకావటంతో అపోహలు తొలగి రైతులు పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు 50 శాతం కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయాలు జరిగాయి. ఒక్క కాజులూరులోనే సగటున దాళ్వాలో 60 మెట్రిక్ టనున్నల దిగుబడి వస్తుందని ఇందులో ఇప్పటి వరకూ సుమారు 23 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం అమ్మకాలు జరగ్గా మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని మండల ఏవో అశోక్ తెలిపారు.

వెంటనే ధాన్యం కొనుగోలు



ధాన్యం విక్రయించాలనుకునే రైతులు కొనుగోలు కేంద్రాల్లో సమాచారమిచ్చిన వెంటనే వీఏఏలు వచ్చి సాంపిల్స్ తీసుకువెళ్లారు. మరుసటిరోజే వారే హమాలీలను, సంచులను తీసుకువచ్చి ట్రాక్టర్లపై ధాన్యం తీసుకువెళ్లారు.
– కేశన వీర్రాజు, రైతు, అంగ్రంగి

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



75 కేజీల బస్తాకు మద్దతు ధర రూ.1530 చొప్పున ప్రభుత్వం ప్రకటించింది. హమాలీ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు చార్జీల కింద మరో రూ.39 ప్రభుత్వమే చెల్లిస్తుంది. దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రానికి విక్రయించటం ద్వారా రూ.1569 పూర్తి ధర లభించింది.
– నరాళ శ్రీను, రైతు, తణుకువాడ

వారం రోజుల్లోనే సొమ్ము జమ



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే నెలలు గడచినా సొమ్ములు విడుదల కావని దళారులు రైతులను నమ్మించేవారు. వారి మాటలు నమ్మకుండా నేను కొనుగోలు కేంద్రానికే ధాన్యం విక్రయించాను. ధాన్యం వెళ్లిన వారం రోజుల్లోనే నా బ్యాంకు ఖాతాకు సొమ్ములు జమయ్యాయి.
– నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, రైతు, బందనపూడి

పురుగు మందు తాగి వ్యక్తి మృతి



ఆంజనేయులు

కాజులూరు: మండలంలోని చేదువాడలో పురుగుమందు తాగి గురువారం వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండుపల్లి ఆంజనేయులు (45) బుధవారం పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని కుటుంబీకులు గమనించి గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆంజనేయులు కొన్నేళ్లుగా గ్రామంలోని ఒక రైతు వద్ద నాలుగు ఎకరాలు తీసుకుని సాగుచేస్తూ అప్పుల పాలయ్యాడు. ఈ విషయంపై గత రెండు రోజులుగా కుటుంబ సభ్యుల మధ్య వివాదం జరుగుతుంది. దీంతో ఆంజనేయులు ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై గొల్లపాలెం ఎస్సై తులసీరామ్‌కేసు నమోదు చేసి లోతుగా విచారణ చేస్తామన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

యానాం: యానాం–అమలాపురం 216 జాతీయ రహదారిలోని తాళ్లరేవు సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ గురువారం పరామర్శించారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నోట్ల సత్యవేణి, మల్లాడి గంగాభవాని, ఓలేటి లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, నీలిమ, గూడపనీటి ప్రభావతి, చింతపల్లి మంగాయమ్మలను పరామర్శించి ఎవరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో కేసులపై ఆరా తీస్తున్న డీఎస్పీ ప్రసాద్

రామచంద్రపురం: రామచంద్రపురం డీఎస్పీగా బుధవారం బాధ్యతలు చేపట్టిన టీఎస్ఆర్‌కే ప్రసాద్ రెండోరోజే గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సీఐ దుర్గారావు, ఎస్సై డి.సురేష్‌బాబులను ఆరా తీశారు. విలేకరులతో మాట్లాడుతూ 1992లో రామచంద్రపురంలోనే ట్రైనీ ఎస్సైగా తన కెరీర్ ప్రారంభించినట్లు తెలిపారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోనే 1996 లో రాయవరం ఎస్సైగాను, 2004 నుంచి 2006 వరకు బిక్కవోలు ఎస్సైగాను బాధ్యతలు నిర్వర్తించానన్నారు. దీంతో సబ్ డివిజన్‌పై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు సిబ్బందిని సమన్వయం చేసుకుని కృషి చేస్తానన్నారు.

అప్రమత్తతతో నేరాల అదుపు

సమీక్ష సమావేశంలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



నేర సమీక్షలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్ (చిత్రంలో) ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ లతామాధురి

అమలాపురం టౌన్: వేసవిలో చోరీలకు అవకాశమెక్కువని, పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయడం ద్వారా నేరాలను అదుపు చేయొచ్చని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం అమలాపురంలో పర్యటించిన ఆయన స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయం, పట్టణ పోలీసు స్టేషన్లను సందర్శించి క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నేరాల రేటు, అదుపు వంటి అంశాలపై లోతుగా చర్చించారు. జిల్లా ఎస్పీ సుసురాపు శ్రీధర్, ఏఎస్పీ కె.లతామాధురి జిల్లాలో నేరాల అదుపునకు చేపట్టిన చర్యలను డీఐజీకి నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అవగాహనతో అదుపు చేయాలని సూచించారు. ఎస్పీ కార్యాలయ సమీక్షలో ఎస్పీ సీఐ కోలా రజనీకుమార్, పట్టణ పోలీస్‌స్టేషన్ తనిఖీలో సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి, రూరల్ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్ఐలు జి.హరీష్‌కుమార్, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఐజీ అశోక్‌కుమార్‌ను మహిళా పోలీసులు కలిశారు. త్వరలో రానున్న దిశ పోలీస్‌స్టేషన్ గురించి చర్చించారు.

నేటి నుంచి సియోచిమ్ క్రికెట్ టోర్నీ

యానాం: యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 30 వరకూ సియోచిమ్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే ఈ టోర్నీలో 10 జట్లు పోటీ పడనున్నాయన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట: మాచవరం శివారు పెచ్చెట్టివారిపాలెంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకింటికి నిప్పంటుకుని రూ.రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికుల తెలిపిన వివరాలిలా.. కొప్పిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన తాటాకింటికి షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్నికి ఆహుతయింది. శ్రీనివాస్ ఇంటి అటకపై పేర్చిన కొప్పిశెట్టి బాల వెంకటరమణ (బాలాజీ)కి చెందిన రూ.1.50 లక్షల విలువైన 15 వేల కురిడీ కొబ్బరి కాయలు ఈ ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికి సర్వం బూడిద పాలయింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు కాలిపోయాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక ఎల్ఎఫ్ ఎం.బలరామ్, వీఆర్వో ఎస్.రమణ, ఆర్ఐ ఇబ్రహీం తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం బియ్యం పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్య మోహన్, మట్టపర్తి సాంబయ్య, విత్తనాల శేఖర్, నందెపు సూరిబాబు, మట్టా వెంకటేశ్వరరావు పెచ్చెట్టి నాగభూషణం తదతరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



పెచ్చెట్టివారిపాలెంలో బాధితులకు సాయం పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

కొనసాగుతున్న క్వారీ వర్కర్స్ సమ్మె



నిరసన వ్యక్తం చేస్తూ సమ్మెలో పాల్గొన్న క్వారీ వర్కర్స్

రామచంద్రపురం: తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్వారీ లారీ వర్కర్స్ చేస్తున్న సమ్మె గురువారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. పట్టణంలోని వనలపూడి బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద క్వారీ లారీ వర్కర్స్ శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని సమ్మె చేస్తున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరిని వీడనాడి చర్చలకు రావాల్సిందిగా డిమాండ్ చేశారు. శాంతియుతంగా సమ్మె చేస్తుంటే కొందరు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. యూనియన్ జనరల్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ తాము 24 గంటలు డ్యూటీ చేస్తామని, వారాంతపు సెలవులు కూడా లేవని, ఇంత కష్టపడి డ్యూటీలు చేస్తున్న తమకు జీతాలు పెంచమంటే మొండిగా వ్యవహరించటం అన్యాయమన్నారు. ఈ సమ్మెలో యూనియన్ ప్రెసిడెంట్ సతీష్, వైస్ ప్రెసిడెంట్ శంకర్‌చౌదరి, కార్యదర్శి దొరబాబు, అజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్‌పై అవగాహన ర్యాలీ



ఆర్ఆర్ఆర్ సెంటర్‌పై పట్టణంలో అవగాహన ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

రామచంద్రపురం: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పురపాకల పరిధిలో 14వ వార్డు చప్పిడివారి సావరంలోని 7వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్‌పై ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈనెల 16 నుంచి నిర్వహిస్తున్న ఆర్ఆర్ఆర్ సెంటర్ వచ్చేనెల 5 వరకు ఉంటుందని సిబ్బంది తెలియజేశారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉండే దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్‌షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్‌లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర వస్తువులను ఈ సెంటర్‌కు అందిచవచ్చని ర్యాలీలో సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరిస్తున్నారు. ఇలా ఆర్ఆర్ఆర్ సెంటర్‌కు వచ్చిన వాటిని అవసరం ఉన్న ఇతరులకు అందజేస్తారని తెలిపారు. ఈ సెంటర్‌కు నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఇవ్వదలచిన వారు తమ ఏరియాలోని శానిటేషన్, సెక్రటరీకి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. ఈ అవగాహన ర్యాలీలో సచివాలయ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో కంట్లో దుమ్ము..



జొన్నాడ–రావులపాలెం మధ్య ఉన్న గౌతమీ వంతెనపై పేరుకుపోయిన చెత్త

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని జొన్నాడ–రావులపాలెం మధ్యనున్న గౌతమీ పాత, కొత్త వంతెనలపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. నెలల తరబడి రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయకపోవడంతో రెయిలింగ్ గోడల వెంబడి దుమ్ము, ధూళి, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనివల్ల వాహనదారులు ప్రయాణించేటప్పుడు ఆ దుమ్ము కళ్లలో పడటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్న పరిస్థితి. దీనిపై హైవే అధికారులు సత్వరమే స్పందించి వంతెనలకు ఇరువైపులా చెత్త, చెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

ఆత్రేయపురం: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు పెట్టవద్దని, ఏ సమస్య ఉన్నా, ఏ సమయంలోనైనా తన దృష్టికి తీసుకుని వస్తే రైతులకు ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని మెర్లపాలెం గ్రామంలో గడప గడపకూ కార్యక్రమంలో పర్యటిస్తుండగా వసంతవాడ గ్రామ రైతులు ఆయనను కలిసి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను వివరించారు. గోనె సంచులు, వాహన సదుపాయం కల్పించాలని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఆర్డీవో ఎం.ముక్కంటితో కలసి వసంతవాడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయంలో రైతులు, అధికారులు, మిల్లర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గోనె సంచులు కొరత లేకుండా చూడాలని, రవాణా వాహనాలు ఏర్పాటులో శ్రద్ధ వహించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. ఆర్డీఓ ఎం.ముక్కంటి మాట్లాడుతూ శుక్రవారంకు 10 వేల సంచులు, 15 లారీలు ఆత్రేయపురం మండలానికి వచ్చేలా చూస్తామన్నారు. అనంతరం రైతులు, అధికారులతో కలసి లొల్ల రైస్ మిల్లును సందర్శించి రైతుల సమక్షంలో శాంపిల్స్ కలెక్షన్, నూక శాతం నిర్ధారణ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

ఆలమూరు: పంట కాలువకు సాగునీరు నిలిపివేసిన దృష్ట్యా సత్వరమే పూడికతీత పనులు చేపట్టాలని కొత్తపేట బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ అన్నారు. వెదురుమూడి పంట కాలువను స్థానిక బీజేపీ నేతలు నాగిరెడ్డి స్వామి, మేడపాటి సీతారామరెడ్డి, వడ్డి దొరయ్య నాయుడు తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. మద్యం షాపు పక్కన వ్యర్థాల వల్ల సాగునీరు ముందుకు సాగదన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే శాశ్వత భూరక్ష పథకం



భూ యజమానులకు భూరక్ష పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: గ్రామాల్లో తరతరాలుగా ఉన్న భూ వివాదాలను పూర్తిగా పరిష్కరించేందుకే ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కుడుపూరులో గురువారం భూ యజమానులకు జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ పిల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సంస్కరణలు చేపడుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల మనస్సు తెలుసుకున్న నేతగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. గతంలో గ్రామీణ ప్రాంత భూ యజమానులు తమ భూములను సర్వే చేయించుకోవాలంటే ఎంతో సమయం వెచ్చించడంతో పాటు నిబంధనలు పాటించాల్సి వచ్చేదని కానీ ఈ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి సర్వే నంబర్‌ను ఆధునిక సాంకేతికతతో సర్వే చేయించి ఆ వివరాలను పత్రాల ద్వారా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. బీసీ నాయకులు పంపన సుబ్బారావు, వీఆర్వో బాలాజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ వార్డు సభ్యుడి మృతి



అల్లం వెంకటరమణ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట పంచాయతీ రెండో వార్డు సభ్యుడు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ అల్లం వెంకటరమణ (42) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అల్లం శ్రీను తాపీ మేస్త్రిగా పనిచేసేవారు. ఆయన మృతికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సంతాపం తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, ఎంఎఎస్ఎం అధ్యక్షుడు దామిశెట్టి సత్యనారాయణమూర్తి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామానికి చెందిన పోలినాటి శిరీష (20) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు గురువారం విలేకరులకు తెలిపారు. శిరీష ఈ నెల 10న రాత్రి ఇంటి వద్దే ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. తరువాత రోజున ఆమెను కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురికి ఎమ్మెల్యే సాయం

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెంలో రావూరి పెదవెర్రియ్య, సుబ్బాయ్యమ్మ దంపతులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. నివాసం ఉంటున్న రేకుల షెడ్డు సీలింగ్ నిమిత్తం అందించారు. అలాగే అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన అడబాల వెంకటేశ్వరరావును పరామర్శించి రూ.5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ముత్యాల దుర్గను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

కోళ్లను చంపించారంటూ ఫిర్యాదు

అయినవిల్లి: తన కోళ్లఫారం తాళాలు పగలగొట్టి కోళ్లను కుక్కలతో చంపించారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి టీటీఆర్ నగర్‌కు చెందిన బద్రి శ్రీనివాసరావుకు అయినవిల్లిలోని మెట్ల కాలనీ సమీపంలో గన్నవరపు దిలీప్ కుమార్‌కు చెందిన కొబ్బరితోటను లీజుకు తీసుకుని కోళ్లఫారం ఏర్పాటు చేసుకున్నాడు. లీజు విషయంలో దిలీప్‌కుమార్‌కు శ్రీనివాసరావుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తన కోళ్లఫారం తాళాలు పగలగొట్టి కుక్కలను పంపించి రూ.లక్ష విలువైన కోళ్లను చంపించాడంటూ ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. దీనిపై బద్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.